# రాధపడిన బాధ

"అబ్బా! రాధా! ఒకసారి వచ్చివెళ్ళవే తల్లీ! నీకు, నీ పెద్దలకి వేయి నమస్కారాలు పెడ్తాను. పుణ్యకినే వుంటావుగా. ఆ మాయదారి పుస్తకం తర్వాత చదువుకో కూడదు..." వంటింట్లోంచి బామ్మ వుట్టిపూర్వోత్తరా లెత్తటంతో చదువుతున్న పత్రిక డ్రాయరుమీదకు గిరాటు కొట్టి విసవిసా రాధ వంటింట్లోకి వెళ్ళింది. "కాస్త ఆ నాల్గు అరటికాయలూ తరిగిపెట్టు, పోపు మాడిపోతోంది" అంది బామ్మ. 'అంత ముందు యెందుకు వేసుకోవాలి? నాలిక చివరిదాకా వచ్చిన ప్రశ్నను రాధ బలవంతాన తిప్పి లోపలకు నెట్టింది. మూలనున్న కత్తిపీటను విసురుగా ముందర వేసుకొని రాధ గబగబా పెచ్చులియ్యటం మొదలుపెట్టింది. 'ఛీ కథ మధ్యలో వదిలేస్తే పట్టుపోతుంది. ఇంతకీ రైలు దూకాడో లేదో, వంటరిగా దూకాడో లేక కథానాయకితో సహా దూకాడో, రైలు దూకడానికి సిద్ధంగా నిలబడ్డ కథానాయకుడు 'ఏవమ్మోయ్ తొందరగా రా!' అని పిలిచినట్లుగా అనిపించింది రాధకు.

“అయ్యో! నీయిల్లు బంగారంకాను! అదేం తరగటమే నా తల్లీ! కూరేమయినా నాలుగు ముక్కలవాలా? అంత కండ తీసేస్తే” బామ్మ మందలింపుతో రాధ నెమ్మదిగా జాగ్రత్తగా తరగటం మొదలుపెట్టింది. మొహం ముడుచుకున్న రాధను చూసి “పనిచేసిన ఆడది యెప్పుడూ చెడిపోదు. జ్ఞాపకం వుంచుకో, రే పత్తారింటికి వెళితే నువ్వే సుఖపడ్తావు. నువ్వు పనిచేయపోతే నిన్నేమీ అనరు. మాకు మేకులు చెక్కతారు కాని–‘తల్లి లేని పిల్ల, విచ్చలవిడిగా వదిలేశారు ఓ పని చేతకాదు, పాడూ చేతకాదు. మేం కోడల్ని తెచ్చుకోలేదు మా యింటికి, ఓ కొరివిని తెచ్చుకున్నాం’ అంటారు. చక్కగా పనిచేశావనుకో, ‘మా కోడలెంత మంచిదమ్మా! చక్కగా బంగారు పిచ్చుకల్లే పనిచేస్తుంది. దానికి చేతకాని పనంటూ లేదు. వాళ్ళ బామ్మ పెంపకం దెంత మంచిది’ చివరి మాటలకి రాధ పకపకా నవ్వేసింది. “అసలు రహస్యం అది” అంది. ముడుచుకుపోయిన ముఖం వికసించటం చూసి “ఆ! అదీ! చక్కగా అలా యెప్పుడూ నవ్వుతూవుండాలి. పని చెప్పగానే మొహం గంటు పెట్టుకున్నట్లు కూర్చుంటేఎలా?” బామ్మ మాటలతోపాటు రాధ కూర తరగటం కూడా పూర్తయింది. కథానాయకుడు యిక సహించనంటున్నాడు. రాధ గబగబా సావిట్లోకి వచ్చింది. “ఇదిగో పోతున్నావా! కాస్త ఆ కత్తిపీట తీసి ప్రక్కనపెట్టి ఆ పెచ్చులు దొడ్లో పారేసిరా. మా తల్లివి కదూ! మా అమ్మవిగా” బామ్మ మాట కాదనలేక రాధ వెనక్కు తిరిగింది.

“పనిచేస్తే ఒకరు వంకపెట్టనా మళ్ళా? ఆ పోన్లేపోన్లే!

అప్పనులే మా బంగారు కొండలా పనిచేస్తావు నువ్వు, నీకు కృష్ణమూర్తిలాంటి మొగుడొస్తామతే తప్పకుండా."

రాధ చేతులు తుడుచుకుని గబగబావచ్చి డ్రాయరు ముందు కుర్చీలో కూలబడింది. పత్రికను విసురుగా పడెయ్యటంమూలాన పేజీలు కలిసిపోయినాయి. ఇంక తీరుబడిగా చదవవచ్చనే వుద్దేశంతో రాధ పేజీలు తిప్పసాగింది.

"రాధా! రాధా" పైనుంచి వాసు ఇల్లదిరిపోయేటట్లు కేకలుపెట్టటం మొదలెట్టాడు. రాధకు వళ్ళు మండిపోయింది' ఇవతల కథానాయకుడు "ప్చ్! లాభంలేదమ్మాయి" అంటు న్నాడు అయినా తప్పలేదు. పత్రికను చేత్తో పుచ్చుకునే రాధ మెట్లదగ్గరకు వెళ్ళింది. అప్పటికే వాసు మెట్లపైకివచ్చి నుంచున్నాడు.

"ఓ రాధమ్మ తల్లీ! ఏ మధురానగరిలో ఉన్నావు? అరగంటనుంచీ ఆపకుండా పిలుస్తున్నాను. గొంతు పగిలి పోతోంది" నిటారుగా నుంచుని రాధను బిగ్గరగా పిలవడం వల్ల తన కెన్ని కష్టాలు కలిగాయో చెప్పుకుపోతున్నాడు.

"అయిందా ఉపన్యాసం, ఇంకా వుందా!"

"ఉపన్యాసం! ఆ మాట వాడవద్దని నీ కెన్నిసార్లు చెప్పాను? నేనేమయినా రాజకీయవేత్త ననుకున్నావా–వేళా పాళా లేకుండా, అడగా పెట్టకుండా ఉపన్యాసం ఇవ్వటా నికి? అసలయినా మనం ఉపన్యాసం యిస్తామంటే...హు"

"సర్లే! ఎందుకు పిల్చావో చెప్పకుండానే దండకం మొంత చదివావో" రాధ విసుక్కుంది.

"ఓ సారీ సిస్టర్! నా పెన్నెక్కడా కన్పించటం

లేదు" వాసు ఒక్కొక్క మెట్టే దిగుతూ తడిలేని కళ్ళని చొక్కాతో తుడుచుకున్నాడు రాధకు వళ్ళు మండింది. "నీ పెన్నుపోతే నన్ను పిలవటం దేనికి?" అంది.

"మరెవర్ని పిలవను?"

"ఎవర్నా కావాలంటే బామ్మను పిలు"

"అమ్మో! బామ్మనే" వాసుదిగుతున్నవాడల్లా రెండు మెట్లు పైకెక్కి "చంపేస్తుంది. అందులో వంటచేస్తుంది కాబోలు, ఆయుధసమేతంగా వుండి వుంటుంది"

"సరే. ఇంకేం? అయితే పూరుకో. కోరుమూసుకుని బామ్మకు తెలియనీకుండా బుద్ధిమంతుడిలా కాలేజీకి దయ చేయి" వాసు మళ్ళా మెట్లుదిగటం మొదలెట్టాడు. "ఛల్లాయ్! ఛల్లాయ్! కాస్త పెన్ను వెతికిపెట్టమ్మా, కాలేజికి టైం అయిపోతోంది కూడాను. మా ఫిజిక్సు లెక్చరర్, యమకింక రుడు. నన్ను తంతాడుకూడాను"

"తంతాడా, నీ అంత హీరోనే" రాధ తన చక్రా ల్లాంటి కళ్ళను తిప్పుతూ ఆశ్చర్యం అభినయించింది.

"నిజంగా తన్నడులే. తన్నినట్లుగా, అంతకంటే ఎక్కువగానే ఖూనీచేసినంత ఇదిగా మాటలంటాడు"

"అయితే పడు" రాధ వెనక్కు తిరిగి డ్రాయరు దగ్గ రకు వచ్చింది.

"పడనా? నలభై మంది ఉన్న క్లాసులో అందులో పక్కనే సుశీ, శశి, రోజా ఉన్న క్లాసులోనే నేను - మా లెక్చరర్ చేత-మాటలు పడనా?" వాసు మెట్లుదిగి రాధ దగ్గ రకు వచ్చాడు.

"అయితే నీ బాధంతా సుశి, శశి, గిశి, రోజా,గీజాల ముందు మాటలు పడాల్సివస్తుందని అన్నమాట"

"అబ్బబ్బ! నేను మూడుపేర్లు చెప్తే,హ్రాస్వాంగి,దీర్ఘాంగి కలిపి మరో రెండుపేర్లు జతచేశావు. కాస్త వెతికిపెట్టవే అమ్మా, ఆ పాడుపుస్తకం తర్వాత చదువుదుగానిలే తీరుబడిగా"

"అబ్బబ్బ! ఇదెక్కడి గొడవంటా? నీపెన్ను నువ్వెక్కడ పెట్టుకున్నావో నాకేం తెలుస్తుందీ?" రాధ బిగ్గరగా అంది.

"నీకు పుణ్యముంటుంది గంగానమ్మ తల్లీ! కాస్త అరవబోకు, బామ్మ వింటుంది."

"అయినా ఒక్కరోజు లేకపోతే యేం? పోనీ మీ సింహాన్ని అడగరాదూ?" రాధ ఎందుకయినా మంచిదని కంఠం తగ్గించింది.

"మా సింహం అసలు కాలేజీకి పెన్ తీసుకువస్తేగా"

"పోనీ ఆ లెక్చరర్నే అడుగు."

"అమ్మో! ఇంకా యేమయినా వుందా? అయన్ను చూస్తూంటే అచ్చు మన బామ్మ గుడ్లురిమి అట్లకాడ చేత పుచ్చుకుని మీద కొచ్చినట్లే వుంటుంది. అసలయినా యీ పాటికి వెతికి యివ్వనే యిచ్చేదానివి"

రాధ యిక గత్యంతరంలేక పత్రిక అక్కడే పడేసి పైకి వెళ్ళింది. డ్రాయరు సొరుగులు, బీరువాలు, పుస్తకాలు లాగూలు అన్నీ వెతికింది. చివరకు మాసినబట్టలూ, పారేసిన బట్టల్లో ఒక పాంటు జేబుకి సురక్షితంగా అంటిపెట్టుకొనివుంది.

"విడిచిన బట్టలు బుట్టలో పారేసినప్పుడు కాస్త జేబుల్లో యేమున్నాయో చూచుకోడదూ?" వాసుకు పెన్ను యిస్తూ రాధ మందలింపుగా అంది.

"తీరికేది చెల్లాయ్? నువ్వు చూస్తూనే వున్నావుగా. అయినా నాకు తెలియక అడుగుతాను. వుంటావుగదా! కాస్త నా విషయం చూడకూడదూ? ఆడపిల్లలకు చదువు కావాలో అని మా మగవాళ్ళు గోలపెట్టి చెప్పించేది యెందుకు?"

"అన్నానికి రారా వాసూ" అన్న బామ్మ పిలుపుతో వాసు నోటికి తాళం పడ్డది. ఎదురు మేకులు చెక్కటమంటే యిదే కాబోలు అనుకుంది రాధ.

డ్రాయరు ముందు కూలబడి పత్రిక తెరిచింది. 'అరగంట, గంటనుంచీ నీకోసం వెయిట్ చేస్తున్నా' అన్నాడు కథానాయకుడు. రాధ కథ మొదలు పెట్టబోయేసరికి "అమ్మాయ్ రాధా" పూజామందిరంలోంచి మామయ్య పిలుపు విన్పించిది. చచ్చాంరా భగవంతుడా! అనుకోని మరో పిలుపు పిలిపించుకోకుండానే రాధ పూజామందిరంలోకి వెళ్ళింది.

"ఇక్కడ పూలేవమ్మా? అబ్బ, తల్లీ! కాస్త నా సంగతి చూడవమ్మా అని యెన్నిసార్లు చెప్పాను?" ఇలాటి వాళ్ళకు యెదురు చెప్పకూడదని రాధ అనుభవముతో నేర్చుకుంది. మౌనంగా పూలుకోసుకొచ్చి అక్కడ పెట్టింది.

"అయ్యో! ఇవాళ మరీ తక్కువ పూశాయేం? అవును మరి, పాపం! వాటికి నీళ్ళూ, నిప్పులూ వుంటేగా, చూడు

రాధా. చెప్తున్నానని మామయ్యమీద కోపగించుకోకు సుమా. కాస్త ఆ చెట్లసంగతి చూడకూడదూ? పూరికేనే వుంటావుగా తల్లీ. చెట్లని జాగ్రత్తగా చూడటంవల్ల యెన్ని లాభాలో చూడు. ఒకటి_ఊరికే కూర్చుంటున్న నీ శరీరానికి చక్కని వ్యాయామం. రెండూ-అదికూడా ఒక కళే. అంటే మనం శరీరానికి వ్యాయామం యిచ్చుకోవటమే కాకుండా ఒకవిధంగా కళని పోషించటం-మూడోది-పూలు మనం డబ్బుపెట్టి కొనుక్కోవాలంటే సాధ్యమా?"

మామయ్య పూజమాట మర్చిపోయి ఉపన్యాసం దంచుతున్నాడు రాధ యింక నిలబడలేక వెనక్కి తిరిగింది. "వెళుతున్నావా? నాకు తెలుసులే. ఇవి నీకు రుచించవని పోనీలేగాని, పదిగంటలు దాటినట్టుంది. మీ అత్తయ్యకు మందుకు టైమయినట్టుంది. మర్చిపోకుండా మందుతోపాటు నారింజరసంకూడా యివ్వుతల్లీ." మామయ్య పూజకు వుపక్రమించాడు.

వింత వ్యక్తులు అనుకుంది రాధ. కథలో నాయకుడు బుంగమూతిపెట్టి కూర్చున్నాడు. అయినా తప్పదనుకుంది రాధ. మేనత్త గదిలోకి వెళ్ళింది.

రాధయిచ్చిన నారింజరసం గ్లాసు తీసుకుంటూ ముక్కుతూ, మూలుగుతూ "కాస్త ఆ పిల్ల లెక్కడకు పోయారో చూడుతల్లీ! మరీ బజుద్దాయిల్లాగా తిరుగుతున్నారు. మట్టిలో కొట్టుకుంటున్నారో, ఏం ఏడుస్తున్నారో కాస్త పిలిచి నీళ్ళుపోసి అన్నం పెట్టించు తల్లీ! అమ్మ మడి గట్టుకున్నట్లుంది. కాస్త వాళ్ళని చూడమ్మా. మీమామయ్య

వున్నారనన్న మాటేగాని..." ఆయాసంతో మూలుగుతూ అత్తయ్య వెనక్కి వాలింది. తలక్రింద దిండు సరిచేసి, శాలువా కంఠందాకా కప్పి తలుపులు జేరవేసి రాధ యివతలకు వచ్చింది.

"ఇప్పుడైనా రావమ్మా మహాతల్లీ" అని కథానాయకుడు విసుక్కున్నాడు. "అత్తయ్యా, అంటూ బాబూ, పాప దగ్గర కొచ్చారు. కథానాయకుడి వంక జాలిగా చూసి రాధ దొడ్లోకి వెళ్ళిపోయింది.

పిల్లల పనయిపోయింతర్వాత యివతలకు వస్తూండగా తండ్రి ఆఫీసుకు వెళ్ళబోతూ లోపలకు వచ్చి "అమ్మా రాధా అని పిలవటంతో రాధ సావిట్లోకి వచ్చింది. చూడు తల్లీ. నీ రాత యెంతో బాగుంటుంది. క్రిందటిసారి మా ఆఫీసర్ యెంతో బాగుందన్నాడు. ఈ రాసిన కాగితాలు ఫెయిర్ కాపీ చేసిపెట్టమ్మా. రెండుగంటలయేసరికి మనిషిని పంపుతాను. పంపించేయాలి. ఆఁ చూడు, కొంచెం జాగ్రత్తగా వ్రాయి. నీకు చెప్పనవసరం లేదనుకో జాగ్రత్తగా వ్రాయి. రెండుగంటలయేసరికి పూర్తి కావాలి యెలా వ్రాస్తావో నీ యిష్టం" రాధ వచ్చే నిట్టూర్పును ఆపుకుంటూ కాగితాలు తీసుకుంది.

నాన్నగారు ఆఫీసుకు వెళ్ళిపోయారు. అత్తయ్య పడుకుంది. మామయ్య వైకుంఠంగారింటికి చదరంగం ఆడుకోటానికి వెళ్ళాడు. అన్నయ్య కాలేజీకి వెళ్ళాడు. పిల్లలు బడికి పోయారు. కథానాయకుడు అమ్మయ్య అనుకున్నాడు.

"అన్నం తిని నీ యిష్టం వచ్చినంతసేపు చదువుకో తల్లీ! నా పని అయిపోతుంది." వంటింట్లోంచి బామ్మ పిల్చింది.

"భోంచేసి వచ్చి డ్రాయరు ముందు స్థిమితంగా కూలబడింది రాధ. వెనకాల బామ్మ వచ్చి "ఏది రాధా. నిన్నటి తర్వాత పద్యాలు చదువు!" అంది పత్తులబుట్ట ముందు పెట్టుకుని వక్క నములుతూ "నే నిప్పుడు చదవలేను బాబూ" రాధ యింక విసుగును అపుకోలేక పోయింది.

"ఏం?" ప త్తి విడదీస్తూ బామ్మ వ త్తి పల్కింది.

"నా కంఠం బాగాలేదు, నొప్పిగా వుంది."

"కంఠానికేమో! నిక్షేపం లాగుంటుంది. పద్యాలు గొంతె త్తి చదువుతే ఆ నొప్పీ గిప్పీ కూడా పోయి నాళాలు సరి అవుతాయి."

రాధకు నవ్వు వచ్చింది.

"ఆఁ! రాధా! ఆ దిక్కుమాలిన పు స్తకాలు నోరె త్తకుండా లోపలలోపల చదువుకుంటే ఏమవుతుంది మరీ? నరాలు బిగుసుకుపోతాయి. లే. లే! ఇవాళ నీకు బావ దగ్గర్నుంచి వు త్తరం వస్తుందిలే!"

రాధ నవ్వుకుంటూ అధ్యాత్మ రామాయణ గ్రంథం తీసి బామ్మముందు కూర్చుని వరుసగా పది పద్యాలు రాగయు క్తంగా పాడింది. హఠాత్తుగా నాన్నగారిచ్చిన కాగితాలు జ్ఞాపకానికి వచ్చాయి.

"ఇంక చాల్లే బామ్మా! నాన్నగారిచ్చిన కాగితాలు రాయాలి" అంది.

"సరే వెళ్ళు" అంతవరకూ జోగుతున్న బామ్మ చెంగు పరుచుకుని క్రింద పడుకుంది.

రాధ తండ్రి ఆఫీస్ రూములోకి వెళ్ళికూర్చుంది. రెండు గంటలసేపు ఆలోచనల్ని, ఆవేశాలని దూరంగా నెట్టి మనసు కాగితాలమీద లగ్నం చేసింది.

పూర్తయిన కాగితాలు సీరియల్ గా నంబరువారీ పెట్టి పెన్ కు కాప్ తగిలించి, హమ్మయ్య అనుకొని వెనక్కి వాలింది. రెండుగంటలు తదేకంగా కూర్చుని వుండటంవల్ల నడుం నొప్పి పుట్టింది. "అమ్మాయిగారూ!" వాకిట్లోంచి కేక వినిపించింది. రాధ కాగితాలు పచ్చిన మనిషికిచ్చేసి సంతృప్తిగా నిట్టూర్చి వచ్చి డ్రాయరు ముందుగా కూర్చుంది. నడుము నొప్పి పుడుతోంది. పోని కాసేపు పడుకుందామా అనుకుంది ఇంతలో వాకిట్లో ఉత్తరాలండీ!" పోస్ట్ మేన్ కేక వినిపించింది రాధ బామ్మజోస్యాన్ని వూహించుకుంటూ వాకిట్లోకి వచ్చింది. ఒకవుత్తరమూ, పార్సిల్ వచ్చాయి. రాధ ఆత్రంగా విప్పింది యేమిటో చూదామని. తీరాచూస్తే కథ! బావరాసికథ! వుత్తరం కూడా బావ వద్దనుంచే- అందులో ఇలా వుంది.

"రాధా."

నా కథ పంపుతున్నాను. కాస్త కాపీ చేసిపెట్టు. నీ వ్రాతతో వెళ్ళిన కథ లింతవరకూ తిరిగిరాలేదు. కాబట్టి నీ వ్రాతమీద నాకు చాలా నమ్మకం వుంది. ఇది పెద్దల నవల. సీరియల్ గా అచ్చయితే యెంత పేరు వస్తుందో నీ బావకు. ఆలోచించుకో- వూరికేనే వుంటావు గాబట్టి కాస్త శ్రద్ధ

వహించి త్వరలో పూర్తి చేయమని ప్రార్థన. నేను సోమవారం ఉదయం పదిగంటలకు వస్తాను. నువ్వు ఆదివారం సాయంత్రానికి పూర్తి చేసి వుంచాలి (సోమవారం పదిగంటల వరకూ నీ అలంకరణే సరిపోతుంది గాబట్టి) ఊరికే వున్ననీకు చక్కని కాలక్షేపం గదూ!

నీ బావ
"ప్రసాద్."

రాధకు వళ్ళు మండిపోయింది! చివ రామాటలు యెందుకో? "ఊరికేనే వుంటావుగా- నా పని చూసిపెట్టు" ప్రపంచంలో వున్న మనుషులంతా ఒకటే వైపు అనుకుంది రాధ. ఆలోచనలలో వున్న రాధకు హఠాత్తుగా కథా నాయకుడి కేక విన్పించింది. రాధ పత్రిక తెరిచింది.

వీధి తలుపెవరో కొట్టారు. తనివాళ చాలా వర్జ్యపు వేళలో కథ మొదలు పెట్టాను అనుకుంది. లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎవరో ఒకావిడ. ఆవిడను రాధెన్నడూ చూడలేదు "కనకమ్మగారున్నారా?" అంటూ రాధ సమాధానం చెప్పక ముందే లోపలకు వచ్చేసింది.

తర్వాత తెల్సింది- బామ్మా, ఆ వచ్చినావిడా చిన్నప్పటి స్నేహితురాండ్రని. ఆవిడ మాటల మధ్యలో అడిగింది. "మీ మనుమరాలికి కుట్లు అల్లికలు ఏమైనా వచ్చా?" అని. బామ్మ రావని తలూపింది. ఆవిడ ఆశ్చర్యపోతూ మరి ఊరికేనే వుంటోంది గదా! ఏం చేస్తుందీ? పిల్ల అలా కాలం పాడు చేస్తూ కూచ్చుంటే తనిలా చూస్తూ ఊరుకోలే"నంది రాధ కేమనుకోవాలో తోచలేదు.

ఆ రాత్రి పడుకోబోతూ రాధ పత్రిక తెరిచింది. కథ యేమయినా సరే పూర్తి చెయ్యాలనే గట్టి పట్టుదలతో.

"అబ్బబ్బ, అసలే దోమలతో చస్తూంటే ఆ దీప మేమిటే రాధా, కాస్త తగ్గించివేద్దూ. పగలల్లా ఏం చేస్తావు? ఊరికేనే వుంటావుగా" రాధ రోషంతో పత్రిక అవతలకు గిరాటుకొట్టింది. "అంత కోపమైతే యెలాగే! బామ్మ మరో వైపు తిరిగి పడుకుంది.

రాధ బరువెక్కిన తలని దిండులో దూర్చుకుంది. బామ్మకు కూరలుతరగాలి. అన్నయ్య పారేసుకున్న పెన్నులు వెతికి యివ్వాలి. మామయ్యకు పూజ విషయాలు చూడాలి. చలిజ్వరంతో వున్న అత్తయ్యకు మందులు చూడటమే గాకుండా, పిల్లల్ని చూడాలి. నాన్నగారికి కాగితాలు వ్రాసి పెట్టాలి. బావకు కథలు కాపీ చేసిపెట్టాలి, కుట్లు కుట్టాలి, అల్లికలు అల్లాలి. కాని చిత్రమేమిటంటే ప్రతివాళ్ళూ, యెవరికి వారే నా విషయం చూడరాదా అంటారు. అందులోగల సబబు వేడెక్కిపోయిన రాధ బుర్రకు అర్థంగా లేదు. దిండులో మొహం దాచుకుని రైల్లోంచి ఉరకటానికి సిద్ధంగా వున్న కథానాయకుడినిగురించి ఆలోచిస్తూ నిద్దరపోయింది స్కూలు జీవితం వదలి సహజ జీవితంలోకి అడుగు పెడుతూ తికమక పడుతున్న రాధ.